

తప్పని ఇన్‌చార్జ్‌ల పాలన

ఉమ్మడి జిల్లాలోని 17 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓలే దిక్కయ్యారు. 18 మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేరు.

10లో



టమాట కిలో రూ.50

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.50 పలికింది. కనిష్టం రూ.24, సరాసరి రూ.36 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం



శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

కంబదూరు: మండలంలోని ఓబగానిపల్లి గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక టీడీపీ నాయకులు కొందరు హెల్త్ క్లినిక్‌లో మంగళవారం రాత్రి మద్యం పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఖాళీ మద్యం సీసాలను అక్కడే వదిలేసి వెళుతూ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం ఈ విషయం వెలుగు చూడడంతో ఎంపీటీసీ బసప్పతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి, విచారణ చేపట్టారు.

జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా వెంకటసుబ్బయ్య



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి(సీఈఓ)గా జి.వెంకటసుబ్బయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ సీఈఓగా కొత్తగా వచ్చిన ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలతో సీఈఓ పోస్టు కూడా కేటాయించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. వైఎస్సార్ జిల్లాలో డీఎల్‌డీఓగా పని చేస్తున్న వెంకటసుబ్బయ్యను ఇటీవల జరిగిన బదిలీల్లో అనంతపురం డిప్యూటీ సీఈఓగా నియమించారు. సీఈఓగా నియమితులైన నంద్యాల డ్వామా పీడీ రామచంద్రారెడ్డి రెండున్నర నెలలు సెలవు పెట్టి అమెరికా వెళ్లారు. దీంతో ఆ పదవి కూడా డిప్యూటీ సీఈఓగా అప్పగించారు.

- ఇటీవలి వరకూ ఇన్‌చార్జ్ సీఈఓగా పని చేసిన చిలంకూరు ఓబుళమ్మను వైఎస్సార్ జిల్లా సీఈఓగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె అక్కడకు వెళ్లేందుకు సుముఖంగా లేరు. జిల్లాలోనే ఏదో ఒక శాఖకు పోస్టింగ్ తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గార్లదిన్నె: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. కల్లూరుకు చెందిన దస్తగిరి గ్రామాల్లో సేకరించిన 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా మర్తాడు క్రాస్‌లో అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. విచారణ అనంతరం వాహనాన్ని సీజ్ చేసి దస్తగిరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అన్నింటా అరాచకం

- అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఉమ్మడి జిల్లా
- అల్లుకుపోయిన మట్కా మహమ్మారి
- కమ్ముకున్న గంజాయి పొగలు
- గ్రామాల్లో అధికారికంగా పేకాట స్థావరాలు
- కొత్త మద్యం పాలసీతో కిక్కు పెంచిన సర్కారు
- భారీగా పెరిగిన దొంగతనాలు, ఏటీఎంల లూటీలు
- అడ్డూ అదుపు లేని బెట్టింగ్ ముఠాలు
- వ్యసనాలతో చిత్తవుతోన్న యువత





ఇటీవల పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన తాడిపత్రి పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పుణ్యమా అని ఉమ్మడి అనంతపురం బ్రాండ్ ఇమేజే మారిపోయింది. ఇన్నాళ్లూ వ్యవసాయ ఆధారిత జిల్లా అని, ఉద్యాన పంటలకు ప్రసిద్ధి గాంచిందని, ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రా అని చెప్పుకునే జిల్లా.. నేడు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిపోయింది.ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మట్కా మహమ్మారి జడలు విప్పింది. గంజాయి పొగలు కారుమబ్బుల్లా కమ్ముకున్నాయి. బెట్టింగ్ వ్యసనం కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. పేకాట విచ్చలవిడిగా సాగుతున్నా అడిగే దిక్కులేదు.తాజా పరిస్థితుల్లో అనంతపురం జిల్లా రకరకాల జూదాలతో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్టు తెలుస్తోంది.

ఎక్కడ చూసినా మట్కా..

ఒకప్పుడు తాడిపత్రికే పరిమితమైన మట్కా ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా విస్తరించింది. బంగారానికి ప్రొద్దుటూరు ఎలా ప్రాచుర్యమో అలా నేడు అనంతపురం జిల్లా మట్కాకు పేరుగాంచింది. అనంతపురం నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో మట్కా భారీగా నడుస్తున్నట్టు తేలింది. రమారమి 42 మంది ఏజెంట్లు పోలీసుల కనుసన్నల్లోనే రోజూ మట్కా నడిపిస్తున్నట్టు సమాచారం. నెలవారీ మామూళ్లు అందుతుండటంతో పోలీసులు ఏమీ అనడం లేదు. రాయదుర్గం, కళ్యాణ దుర్గం, గుంతకల్లు, ధర్మవరం నియోజకవర్గాల్లో మట్కా రాసే ఏజెంట్లు ఎక్కువయ్యారు. వీళ్లందరూ పోలీసులతో సఖ్యతగా మెలుగుతూ వ్యవహారం నడిపిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గం'జాయ్'..

గతంలో ఎన్నడూ లేని రీతిలో ఉమ్మడి జిల్లాలో గంజాయి లభిస్తున్నట్టు తేలింది. ఇటీవల స్వయంగా టీడీపీ నాయకుడు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డే గంజాయికి అడ్డూ అదుపూ లేదని వ్యాఖ్యానించారంటే పరిస్థితి అంచనా వేయొచ్చు. ఇటీవల రాయదుర్గంలో 12 కేజీల గంజాయి లభించింది. అనంతపురం నగరంలో ప్రతి చోటా గంజాయికి బానిసలైన యువత కనిపిస్తున్నారు. రాత్రి పూట హైవేల్లోని ధాబాల్లో హుక్కా, గంజాయి పీలుస్తున్న యువత బాగా కనిపిస్తున్నట్లు వెల్లడైంది. దీనికితోడు దొంగతనాలు, ఏటీఎంల లూటీలు కూడా భారీగా పెరిగిపోయాయి.

కొత్త పాలసీతో మద్యం కిక్కు..

గతంలో బహిరంగ మద్యపానంపై నిషేధం ఉండేది. అయితే, కూటమి సర్కారు ఈ విషయాన్ని గాలికొదిలింది. జిల్లా వ్యాప్తంగా ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో అనధికారికంగా మద్యం సేవించే వెసులుబాటు కల్పించారు. మద్యం తాగిస్తున్నందుకు ఆయా హోటళ్ల నిర్వాహకులు సివిల్ పోలీసులకు కప్పం కడుతున్నారు. ఇక ఈనెల 16వ తేదీ నుంచి కొత్త మద్యం షాపులు రానుండటంతో మత్తు మరింత పెరగనుంది. కర్ణాటక నుంచి వచ్చే మద్యం కూడా బాగా పెరిగినట్టు పోలీసుల పరిశీలనలో వెల్లడైంది.

పేకాట, బెట్టింగ్ ముఠాల దూకుడు

2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలొచ్చాయి. జూన్ 12న కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ రోజునుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేకాట, బెట్టింగ్ ముఠాల దూకుడు పెరిగింది. స్వయానా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశ్ సొంతూరు కొకుంట్లలోనే టీడీపీ మండలస్థాయి నేత పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు తేలింది. ఎక్కడికక్కడ అధికారికంగానే ఎమ్మెల్యేల అండతో పోలీసులే పేకాట నడిపిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ ముఠాలు స్వైరవిహారం చేస్తున్నాయి. సైబర్ నేరాలు పెరిగాయి. ఈ క్రమంలో రకరకాల వ్యసనాలు, జూదం తదితర వాటిలో ఉమ్మడి అనంతపురం జిల్లా అన్నిటికంటే ముందంజలో ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

కాలుష్యంతో వాతావరణంలో పెను మార్పులు



సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: కాలుష్యం కారణంగా వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని, జీవ వైవిధ్యం, మొక్కల సంరక్షణ, పెంపుదలే ఇందుకు శాశ్వత పరిష్కారమని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) విశ్రాంత ప్రొఫెసర్ ఎన్‌హెచ్. రవీంద్రనాథ్ అన్నారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పది గ్రామాల్లో క్లైమేట్ రిజిలెంట్ విలేజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీఆర్‌వీడీపీ) అమలు చేయాలని తలపెట్టారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా నిపుణులతో కసరత్తు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా బుధ, గురువారాల్లో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు ప్రారంభోపన్యాసం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి చేయగా, అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎన్‌హెచ్ రవీంద్రనాథ్ మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, పంటల సరళి తదితర అంశాలను అధ్యయనం చేశామన్నారు. కర్బన ఉద్గారాలు, కాలుష్యం పెరిగిన నేపథ్యంలో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని పది మండలాల్లో 45 శాతం వర్షపాతంలో ఏటా వ్యత్యాసం ఉందన్నారు. తీవ్రమైన వర్షాభావం ఏర్పడి పంటలపై ప్రభావం పడుతోందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్‌కే ప్రిన్సిపల్ సైంటిస్ట్ విజయశంకర్ బాబు, బండి వెంకటేశ్వర్లు, సీకే గంగూలి, భక్తర్‌వలి, మురళీకృష్ణ, మీడియా కోఆర్డినేటర్ ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- వ్యవసాయ, అనుబంధ శాఖల పనితీరుపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివనారాయణశర్మ

అనంతపురం అర్బన్: 'ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు రైతులకు చేరేలా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలి. ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకుండా నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల పనితీరుపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–పంట నమోదుకు సంబంధించి సూపర్ చెక్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న ఏడీ, వెటర్నరీ అసిస్టెంట్, పశుసంవర్ధక అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం ఆ శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాయాలని సూచించారు. మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ సర్వీసు పూర్తిస్థాయిలో అమలుకు వైద్యులు, మందులు, ఇతర అవసరాలకు సంబంధించి నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలన్నారు. వ్యవసాయ పనుల్లో డ్రోన్లు వినియోగించేలా చూడాలన్నారు. సంబంధిత కార్పొరేషన్లకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డీసీఓ అరుణకుమారి, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసనాయక్, పశుసంవర్ధక శాఖ ఏడీ రాధిక, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల పోషణ మన బాధ్యత

వయోవృద్ధుల పోషణ, సంరక్షణ మన బాధ్యతని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు.తన చాంబర్‌లో వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టం–2007, నియమావళి–2011 పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమాల ఏర్పాటు, పర్యవేక్షణ, నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. కరపత్రాలను మండల, మునిసిపల్ కార్యాలయాల్లో పంపిణీ చేయాలని చెప్పారు. వయోవృద్ధుల కోసం హెల్ప్ లైన్ నంబర్ 14567, జిల్లా హెల్ప్‌లైన్ నంబరు 08554–2323380 అందుబాటులో ఉంటుందన్నారు. వృద్ధులు ఈ నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్య తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్ పాల్గొన్నారు.

ఈ–పంట నమోదుపై సూపర్ చెక్

రాప్తాడురూరల్/ఆత్మకూరు: అనంతపురం రూరల్ మండలం పూలకుంట, ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామాల్లో ఈ–పంట నమోదుపై సూపర్ చెక్‌ను కలెక్టర్ వినోద్ కుమార్ బుధవారం పరిశీలించారు. తలుపూరు రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. చియ్యేడు రెవెన్యూ పొలం పూలకుంట గ్రామం వద్ద రైతు అక్కమ్మకు చెందిన దానిమ్మ తోటలో సూపర్ చెక్ నిర్వహించారు. అందులో వచ్చిన డేటాను కలెక్టర్ నిర్ధారించారు. దానిమ్మ పంటను ఎప్పుడు సాగు చేశారు? బోరు ఉందా? నీరు బాగా పడుతోందా? ఎన్ని ఎకరాల్లో పంట సాగు చేశారు? తదితర వివరాలను రైతు నుంచి కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ రవి, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహులు, ఏఓ సుచరిత, టెక్నికల్ ఆఫీసర్ శంకర్ లాల్, ఎంఏఓ శశికళ, ఏఈఓలు మురళీకృష్ణ, సుజిత, వీహెచ్ఏ కవిత, ఎంపీఈఓ శ్రావణి తదితరులు ఉన్నారు.



అనంతపురంలోని కొత్తూరులో సరస్వతీదేవి అలంకరణ

సరస్వతీ.. నమస్తుభ్యం

దసరా దేవీ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో భక్తులతో సందడి నెలకొంది. అమ్మవారి నామస్మరణతో అంతటా భక్తిభావం వెల్లివిరుస్తోంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. కదిరిలో ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి సరస్వతీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సరస్వతీదేవి అలంకారంలో ఖాద్రీశుడు

అపార్‌మైన ఉపయోగాలు

- విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ పేరుతో గుర్తింపు కార్డు
- ఆధార్ తరహాలో 'అపార్' జారీకి కేంద్ర ప్రభుత్వం చర్యలు
- కేజీ నుంచి పీజీ వరకు వివరాలు
- ఇప్పటికే విద్యాశాఖకు అందిన ఆదేశాలు
- తొలి విడతగా 9 నుంచి ఇంటర్ విద్యార్థుల వివరాల నమోదు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆధార్ తరహాలో దేశంలోని విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరిట జీవితకాల గుర్తింపు కార్డును ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు 'వన్ నేషన్–వన్ ఐడీ' కార్డును అందుబాటులోకి తీసుకొస్తున్నారు. స్కూల్ విద్యార్థుల నుంచి యూనివర్సిటీ విద్యార్థుల వరకు ఇవ్వనున్న 'అపార్' ఐడీతో నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆపార్ ప్రక్రియను ప్రారంభించాలని ఇప్పటికే రాష్ట్రాల విద్యాశాఖలను కేంద్రం ఆదేశించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను ప్రారంభించింది. ముందుగా ఇంటర్, ఉన్నత పాఠశాలల్లో చేపట్టేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో నమోదు ప్రక్రియపై ఇటీవల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కూడా కల్పించింది. అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేశారు. దసరా సెలవుల అనంతరం ఈ ప్రక్రియ వేగవంతం కానుంది. తల్లిదండ్రుల నుంచి నిరభ్యంతర పత్రాలపై సంతకాలు కూడా తీసుకుంటున్నారు.

కేజీ నుంచి పీజీ వరకూ..

పాఠశాలలో చేరిన సమయంలో విద్యార్థులకు 'అపార్' నంబర్‌ను ప్రభుత్వం కేటాయిస్తుంది. ప్రస్తుతం బడుల్లో విద్యార్థుల చేరికలన్నీ ఆధార్ వివరాల ఆధారంగా జరుగుతున్నాయి. దీని ప్రకారం వారికి యూడైస్ ప్లస్‌లో పర్మినెంట్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్‌ను కేటాయిస్తున్నారు. ఇప్పుడు దానికి అదనంగా 'అపార్' నంబర్‌ను ఇవ్వనున్నారు. ఇది చదువులు పూర్తయ్యే వరకు ఆధార్ మాదిరి ఒక్కటే నంబర్ ఉంటుంది. ఈ నంబర్‌తోనే ఐడీ కార్డు ఇస్తారు. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందే సమయంలోనూ ధ్రువీకరణ పత్రాలను భౌతికంగా కాకుండా డిజిటల్‌లోనే పరిశీలించి సీటు ఇచ్చే అవకాశం ఉంటుంది.

12 అంకెల నంబరు, 'క్యూ ఆర్' కోడ్

అపార్ కార్డు 12 అంకెల కల్గిన నంబరు ఉంటుంది. విద్యార్థులకు సంబంధించి పూర్తి అకడమిక్ సమాచారం ఇందులో పొందుపరుస్తారు. కేజీ నుంచి పీజీ వరకు ఎక్కడెక్కడ చదివాడు, కుటుంబ వివరాలు, ఎన్ని స్కూళ్లు, కళాశాలలు మారాడు, తరగతుల వారీగా ఎన్నిమార్కులు వచ్చాయి, ఏ సంవత్సరం ఫెయిల్ అయ్యాడు, ఎప్పుడు పాస్ అయ్యాడు, ఒకవేళ స్కాలర్‌షిప్పు పొంది ఉంటే ఎన్నిసార్లు తీసుకున్నారు, నైపుణ్యాలు, అవార్డులు, రివార్డులు తదితర



వివరాలు ఇందులో పొందుపరుస్తారు. ఈ కార్డుపై క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. దాన్ని స్కాన్ చేసినా వివరాలన్నీ ఇట్టే తెలిసిపోతాయి.

ఉపయోగాలెన్నో..

- ఒక స్కూల్‌లో 5వ తరగతి చదువుకున్న విద్యార్థి 6వ తరగతిలో మరో స్కూల్ మారే సమయంలో పూర్వ తరగతుల్లో వచ్చిన మార్కుల వివరాలు గత స్కూళ్ల నుంచి తెచ్చే పని ఉండదు. 'అపార్' నంబరు ఎంటర్ చేస్తే చాలు గతంలో ఏయే స్కూళ్లలో చదివాడు.. ఏ తరగతిలో ఎన్నిమార్కులు వచ్చాయనే వివరాలన్నీ అందులో కనిపిస్తాయి.
- ఓ యువకుడు ఒక ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్తున్నాడు. ఆ సమయంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లను ఫిజికల్‌గా తీసుకెళ్లాల్సిన పనిలేదు. 'అపార్' నంబరు చెబితే చాలు. ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి, ఎక్కడెక్కడ చదివాడు అనే వివరాలు వచ్చేస్తాయి.

జిల్లాలోని జూనియర్ కళాశాలలు	144
విద్యార్థుల సంఖ్య	49,820
పాఠశాలలు	2,516
విద్యార్థుల సంఖ్య	3,72,858

ఇప్పటికే శిక్షణ పూర్తి



విద్యార్థులకు అత్యంత ఉపయోగకరంగా ఉండే 'అపార్' రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఇటీవల ప్రిన్సిపాళ్లకు ఇంటర్ బోర్డు అధికారులు ఆన్‌లైన్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. దసరా సెలవుల అనంతరం అన్ని కళాశాలల్లోనూ ప్రక్రియను పూర్తి చేస్తారు. తల్లిదండ్రుల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకుని 'అపార్' రిజిస్ట్రేషన్ చేస్తారు. విద్యార్థి విద్యా జీవిత చరిత్ర మొత్తం ఈ కార్డులో ఉంటుంది. ఎక్కడికి వెళ్లినా ఈ నంబరు ఎంటర్ చేస్తే చాలు విద్యార్థి చదువుకు సంబంధించిన అన్ని వివరాలు తెలిసిపోతాయి.

– వెంకటరమణనాయక్, డీవీఈఓ, అనంతపురం

జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి బుధవారం తెలిపారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కొన్ని ప్రాంతాల్లో నమోదు కావచ్చన్నారు.

క్లుప్తంగా

పీఎం సూర్య ఘర్ సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ

అనంతపురం అర్బన్: పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 'సూర్య ఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకోండి' అనే పోస్టర్లను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ పథకం కింద జాతీయ బ్యాంకులు 80 శాతం రుణాన్ని 7 శాతం వడ్డీతో అందిస్తాయన్నారు. సోలార్ రూఫ్ టాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఎస్‌పీడీసీఎల్ డీఈ రామకృష్ణ, ఏఈ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి



దూడ కళేబరం

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో గేదె దూడపై చిరుత దాడి చేసింది. రైతు వెంకటేశులు తోటలో బుధవారం తెల్లవారుజామున ప్రవేశించిన ఓ చిరుత పశువుల మందలోని 11 నెలల గేదె దూడను అక్కడి నుంచి లాక్కెళ్లింది. గమనించిన రైతు కేకలు వేసినా ఫలితం లేకపోయింది. తోటకు సుదూరంగా దూడను లాక్కెళ్లి చంపి సగానికి పైగా తినేసింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారి తిమ్మక్క, పశువైద్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పంచనామా అనంతరం దూడ కళేబరాన్ని ఖననం చేశారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

శింగనమల: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇసుక అక్రమ తరలింపు ఊపందుకుంది. టీడీపీ నేతల అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. పోలీసులు పలు మార్లు వాహనాలను అదుపులోకి తీసుకుని సీజ్ చేస్తున్నా... వారిలో మార్పు రాలేదు. తాజాగా మంగళవారం రాత్రి శింగనమల మండలం పెద్ద జలాలపురం వద్ద నున్న వంక నుంచి టీడీపీ నాయకులు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా జాతీయ రహదారిపై రెండు టిప్పర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు.

వ్యక్తిపై దాడి



గాయపడిన రామప్రసాద్

యాడికి: పాత కక్షల నేపథ్యంలో ఒంటరిగా ఉన్న వ్యక్తిపై బంధువులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం లక్షుంపల్లికి చెందిన బోయ రామప్రసాద్, బోయ నాగరాజు మధ్య పాత కక్షలు ఉన్నాయి. గతంలోనూ వీరు పరస్పర దాడులకు పాల్పడిన ఘటనలు చాలా ఉన్నాయి. బుధవారం రాయలచెరువుకు వెళ్లేందుకు సిద్ధమైన రామప్రసాద్.. స్థానిక ప్రాథమిక పాఠశాల సమీపంలో ఆటో కోసం ఎదురు చూస్తుండగా బంధువులు నాగరాజు, నాగభూషణం, నాగ శేఖర్‌తో పాటు మరో ఐదుగురు కట్టెలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామప్రసాద్‌ను కుటుంబసభ్యులు వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు నాగశేఖర్, నాగరాజు, నాగభూషణంతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

● కాయకు కవర్... ఊజీ పరార్



జామకాయలకు కట్టిన కవర్లు

మారిన వాతావరణ పరిస్థితుల్లో ఉద్యాన పంటలకు ఆశిస్తున్న చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులు ఎప్పటికప్పుడు సరి కొత్త పద్ధతులు పాటిస్తున్నారు. ఈ క్రమంలో గార్లదిన్నె మండలం తిమ్మంపేటకు చెందిన రైతు నారపరెడ్డి తాను సాగు చేసిన జామ పంటను కాపాడుకునేందుకు నూతన యాజమాన్యం పాటిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. పంట చేతికొస్తున్న తరుణంలో ప్రమాదకరమైన ఊజీ పురుగు ఆశించకుండా ఉండేందుకు జామకాయలకు కవర్లు కట్టారు. దీంతో పంట దిగుబడిలో నాణ్యత పెరిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కవర్లు కడుతున్న రైతు నారపరెడ్డి



విరగ్గాసిన జామకాయలు

తప్పని ఇన్‌చార్జ్‌ల పాలన

- ఉమ్మడి జిల్లాలో 17 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓలే దిక్కు
- ఉత్తర్వులు జారీ చేసిన జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని మండల పరిషత్‌లకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేక ఇన్‌చార్జ్‌లను కొనసాగించాల్సి వస్తోంది. 63 మండలాలకు గాను 18 మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేరు. దీంతో శ్రీసత్యసాయి జిల్లాలో 11 మండలాలు, అనంతపురం జిల్లాలో ఆరు మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓలను నియమించారు. ఆయా మండల కార్యాలయాల్లో పని చేసే పరిపాలనాధికారులు(ఏఓలు), ఈఓఆర్డీలకు ఎఫ్ఏసీ ఇచ్చి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా నియమించారు. నాలుగు మండలాల(కంబదూరు, బొమ్మనహాళ్, వజ్రకరూరు, నల్లమాడ)కు మాత్రం పక్క మండలాల ఎంపీడీఓలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అనుమతితో జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	హోదా	ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా..
ఎం.నందకిశోర్	ఏఓ, బ్రహ్మసముద్రం	బ్రహ్మసముద్రం
జీఎస్‌రామచంద్ర	ఎంపీడీఓ, కంబదూరు	కళ్యాణదుర్గం
బి.బాలాజీ	ఈఓఆర్డీ, కుందుర్పి	కుందుర్పి
ఎస్.దాసా నాయక్	ఎంపీడీఓ, డి.హీరేహాళ్	బొమ్మనహాళ్
కె.రఘురామరావు	ఈఓఆర్డీ, శెట్టూరు	శెట్టూరు
బి.వి.రవిప్రసాద్	ఎంపీడీఓ, ఉరవకొండ	వజ్రకరూరు
బి.వాసుదేవరెడ్డి	ఏఓ, యల్లనూరు	యల్లనూరు
కె.రామానాయక్	ఏఓ, తలుపుల	తలుపుల
పి.రెడ్డెప్ప	ఏఓ, తనకల్లు	తనకల్లు
జి.గంగాధర్	ఏఓ, గుడిబండ	గుడిబండ
కె.ఓ.శ్రీధర్‌రావు	ఈఓఆర్డీ, పరిగి	పరిగి
ఎల్,రామ్‌కుమార్	ఏఓ, రొద్దం	రొద్దం
ఎ.జి.నటరాజ్	ఈఓఆర్డీ, కొత్తచెరువు	కొత్తచెరువు
ఎస్.అనిల్‌కుమార్	ఈఓఆర్డీ, కనగానపల్లి	కనగానపల్లి
డి.రాబర్ట్ విల్సన్	ఎంపీడీఓ, ఓబుళదేవరచెరువు	నల్లమాడ
ఎ.వి.రమణమూర్తి	ఏఓ, చిలమత్తూరు	చిలమత్తూరు
జి.అంజినప్ప	ఈఓఆర్డీ, నంబులపూలకుంట	నంబులపూలకుంట

ఎరువుల సొమ్ము మింగేశారు!

- సొంతానికి వాడుకున్న కొందరు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు
- రూ.50 లక్షలు జేబుల్లో వేసుకున్న వైనం
- పట్టించుకోని వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు



అనంతపురం అగ్రికల్చర్: సర్కారుకు అందాల్సిన ఎరువుల సొమ్ము కొందరు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల జేబుల్లోకి చేరింది. గత నాలుగు నెలల కాలంలోనే ఏకంగా రూ.50 లక్షలు దర్జాగా వాడేసుకున్నారు. డబ్బును వసూలు చేయించాల్సిన వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఖరీఫ్, రబీ ఎరువుల ప్రణాళిక అమలులో బాగంగా వివిధ కంపెనీల నుంచి యూరియా, డీఏపీ ఎరువులు సరఫరా అవుతుంటాయి. ఇండెంట్, డిమాండ్ మేరకు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్‌లు, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ తదితర ఎరువులను వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్‌ఎస్‌కేలకు సరఫరా చేస్తుంటారు. వాటిని ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు రైతులకు విక్రయించిన తర్వాత అదే రోజు లేదా మరుసటి రోజు ఏపీ మార్క్‌ఫెడ్‌కు జమ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. నెలలు కావస్తున్నా సొమ్ము కట్టకుండా కట్టుకథలు చెబుతూ వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 451 ఆర్‌ఎస్‌కేలు ఉండగా గత నాలుగు నెలల కాలంలో 3,016 మెట్రిక్ టన్నులు యూరియా, 540 మెట్రిక్ టన్నులు డీఏపీ, 548 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్‌లు, 85 మెట్రిక్ టన్నులు ఎంఓపీ ఎరువులను ఆర్‌ఎస్‌కేల ద్వారా రైతులకు విక్రయించారు.

రికవరీపై ఉదాసీనత..

కొందరు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు ఎరువుల సొమ్ము మార్క్‌ఫెడ్‌కు, సర్కారుకు జమ చేయకున్నా వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. గట్టిగా ఆదేశాలు ఇవ్వడం లేదా అధిక మొత్తం బకాయి పడిన ఒకరిద్దరిపై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమిస్తే వసూలవుతాయని తెలిసినా పట్టించుకోవడం లేదు. అనంతపురం హబ్ పరిధిలో రూ.1.40 లక్షలు, గుత్తి హబ్ పరిధిలో రూ.15.35 లక్షలు, కళ్యాణదుర్గం హబ్ పరిధిలో రూ.11.25 లక్షలు, రాయదుర్గం హబ్ పరిధిలో రూ.8.57 లక్షలు, తాడిపత్రి హబ్ పరిధిలో రూ.7.75 లక్షలు, ఉరవకొండ హబ్ పరిధిలో రూ.5.50 లక్షలు... ఇలా రూ.50 లక్షలకు పైగా సొమ్ము వాడుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇలాగే విత్తన వేరుశనగ, ఉలవలు, రాగులు, జొన్నలు, పెసలు, అలసందలు, కొర్రల పంపిణీకి సంబంధించి కూడా రైతుల నుంచి వసూలు చేసిన నాన్‌సబ్సిడీ సొమ్మును కూడా కొందరు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు ఏపీ సీడ్స్‌కు చెల్లించలేదని తెలిసింది. ఏపీ సీడ్స్‌కు కూడా రూ. లక్షల్లోనే బకాయి పడినట్లు సమాచారం. గట్టిగా అడిగేవారు లేరనే నిర్లక్ష్యంతోనే సొమ్ము సొంతానికి వాడుకుంటున్నట్లు తెలుస్తోంది.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత బుధవారం విడుదల చేశారు. మొత్తం 8,551 మంది పరీక్ష రాయగా, 3,392 మంది ఉత్తీర్ణత (39.67 శాతం) చెందారు. బీఏ (ఆనర్స్)లో 461 మందికి గాను 108 మంది, బీబీఏ (ఆనర్స్)లో 818 మందికి గాను 353 మంది, బీసీఏ (ఆనర్స్)లో 174 మందికి గాను 62 మంది, బీసీఎం (మేథ్స్, కంప్యూటర్స్) (ఆనర్స్) లో 4,512 మందికి గాను 1,635 మంది, బీఎస్సీ (ఆనర్స్)లో 2,586 మందికి గాను 1,234 మంది ఉత్తీర్ణత చెందారు. ఫలితాలు గురువారం నుంచి జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో పేపర్‌కు రూ.500లు చెల్లించాల్సి ఉంటుంది. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈ. రమేష్ బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి.లోకేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం. శంకర్, సూపరింటెండెంట్ మారుతి తదితరులు పాల్గొన్నారు. కాగా, మెగా సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బి.అనిత పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

చెక్‌డ్యామ్‌లో పడి రైతు మృతి

గుత్తిరూరల్: మండలంలోని బేతాపల్లికి చెందిన రైతు బోయ నాగరాజు (40) ప్రమాదవశాత్తు చెక్ డ్యామ్‌లో పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం తన పొలానికి వెళుతూ కాలుజారి చెక్ డ్యామ్‌లో పడ్డాడు. గుర్తించిన సమీప పొలాల్లోని రైతులు వెంటనే కాపాడి ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు.

ముగిసిన జిల్లా స్థాయి బాలబాలికల చెస్ టోర్నీ



చెస్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులు

అనంతపురం: జిల్లా అండర్–15 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్–2024 టోర్నీ బుధవారం ముగిసింది. అండర్–15 ఓపెన్ విభాగంలో ఎ.సాయియశస్వి మొదటి స్థానం, పి. సంజయ్ సాహుల్ రెండో స్థానం, అండర్–15 బాలికల విభాగంలో ఛాంపియన్‌గా ఎ.సుకృత నిలిచారు. రెండో స్థానాన్ని షారోన్ బ్లెస్సీ దక్కించుకుంది. రెండు విభాగాల్లోనూ తొలి నాలుగు స్థానాలు దక్కించుకున్న వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ మూడు రోజుల పాటు గుంటూరు వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నట్లు ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం: ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన అండర్–14, 17 విభాగాల్లో స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. 38 కేజీల విభాగంలో కె.ద్రిషణ, 45 కేజీల విభాగంలో ఎల్.గౌతం కృష్ణారెడ్డి, 63 కేజీల విభాగంలో వి.హరిచరణ్ తేజ్ బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే ఈ నెల 4, 5 తేదీల్లో రైల్వే కోడూరులో జరిగిన స్కూల్‌గేమ్స్ అండర్–19 పోటీల్లో 68 కేజీల విభాగంలో ఎం.లిఖిత్‌కుమార్ బంగారు పతకం, నివాస్ సిల్వర్ మెడల్ సాధించారు. 68వ స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి పోటీలు నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరగనున్నాయి.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గుంతకల్లు: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి బంగారుసొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. స్థానిక రైల్వే జంక్షన్‌లోని జీఆర్‌పీ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన సింగంరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తరచూగా రైళ్లలో ప్రయాణిస్తూ నిద్రలో ఉన్న ప్రయాణికుల బ్యాగులను అపహరించడం, కిటికీ వద్ద కూర్చొన్న మహిళల మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్లడం వంటి చోరీలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా రైల్వే పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు జీఆర్‌పీ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులు వెలుగు చూశాయి. నిందితుడిని అరెస్ట్ చేసి, 60 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

జిల్లా బాలుర క్రికెట్ జట్టు



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

అనంతపురం: నరసరావు పేటలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–14 బాలుర క్రికెట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టును జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపిక చేశారు. జట్టులో చోటు దక్కించుకున్న వారిలో టి.కిరణ్‌కుమార్ (కెప్టెన్), కె.అశ్వస్ ఆచారి (వైస్ కెప్టెన్), సి.గోకుల్, ఆర్.ఆదినారాయణ రెడ్డి, ఎ.హేమచంద్రా నాయక్, ఈ.రోహిత్, పంకజ్ మీనా, పి.భువన్‌రెడ్డి, ఎస్.కార్తీక్, హేమంత్‌కుమార్, ఎన్.ప్రాణధీర్, వై.లిఖిత్, యు.దేవస్కంధ, వెంకటసాయి, ఎం.దేవాన్ష్ రోహిత్, ఉత్తేజ్ యాదవ్ ఉన్నారు. కోచ్‌గా ఆర్.కుమార్‌ను ఎంపిక చేశారు.

క్లుప్తంగా

బహుజనుల ఆశాజ్యోతి కాన్షీరామ్



కాన్షీరామ్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: బహుజనుల ఆశాజ్యోతి కాన్షీరామ్ అని ఆర్‌ఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నారాయణ నాయక్ అన్నారు. బుధవారం నగరంలోని కాన్షీరామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ నాయక్ మాట్లాడుతూ.. కాన్షీరామ్ గొప్ప రాజకీయ నాయకుడని.. అంతేకాకుండా సామాజిక సంస్కర్త, బహుజనుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. బహుజన సమాజ్ పార్టీని స్థాపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబులేసు, రాఘవేంద్ర రావు, మహేష్ నాయక్, కిష్టప్ప, నాగేంద్ర, శివ శంకర్, మారుతి ప్రసాద్, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా రావాలని ఆదేశించారు.

పోరాట యోధుడు చెగువేరా



చెగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలు నిర్వహించిన చెగువేరా గొప్ప పోరాట యోధుడని ఏఐవైఎఫ్ నాయకులు కొనియాడారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ అధ్యక్షతన చెగువేరా వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చెగువేరా చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ.. చెగువేరా పోరాటాలను యువత స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగ, ఉపాధి సాధనకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ కృష్ణ, శ్రీనివాస్, అశోక్, సుమంత్, రియాజ్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



అలంకరణలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆశ్వయుజ మాస శుద్ధ షష్టి సందర్భంగా ఆలయంలో పూజలు చేపట్టారు. తొలుత శ్రీవల్లి దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాలతో సుబ్రహ్మణ్యేశ్వరుడికి కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు.

అనంత స్వచ్ఛంద సంస్థల చేయూత



వైద్యం కోసం ఆర్థికసాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: అనంత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరోసారి మానవత్వాన్ని చాటుకుని ఓ కుటుంబానికి అండగా నిలిచారు. వివరాలు నవోదయ కాలనీలో నివాసముంటున్న రామాంజిని గార్లదిన్నె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. వైద్యం కోసం దాదాపు రూ.2 నుంచి 3 లక్షల వరకు వైద్యానికి అవసరమైంది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆ కుటుంబ సభ్యులు సాయం కోసం ఎదురు చూశారు. విషయం తెలుసుకున్న అనంత స్వచ్ఛంద సంస్థలు బుధవారం ఆ కుటుంబానికి రూ.50,150 ఆర్థికసాయం అందజేశారు. మరింత మంది దాతల సహకారంతో సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లాల్‌బాషా, బాలకృష్ణ, చంద్ర, శ్రీదేవి, పవన్, నరేష్ మణి, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారి

- శ్రీనగర్ కాలనీలో వర్క్ ఆర్డర్ లేకుండా రూ.2.2 కోట్ల పనులు ప్రారంభం
- నిబంధనలు ఉల్లంఘించిన ఓ కన్‌స్ట్రక్షన్స్
- పట్టించుకోని అధికారులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నిబంధనలతో పని లేకుండా పనులు అడ్డగోలుగా చేస్తున్నారు. అందుకు నిలువెత్తు నిదర్శనమే నగరంలోని శ్రీనగర్ కాలనీలో నిర్మిస్తున్న అడ్డ'దారి' అని చెప్పాలి. శ్రీనగర్ కాలనీలో రూ.2.2 కోట్ల బీటీ రోడ్డు పనులను ఎటువంటి వర్క్ ఆర్డర్ లేకుండా ఓ కన్‌స్ట్రక్షన్స్ చేపడుతుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఇంజినీరింగ్ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో పనులు చకచకా జరిగిపోతున్నాయి.

ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరుల ప్రోద్బలంతో..

దీపం ఉండగానే ఇళ్లు చక్కదిద్దుకోవాలన్న ధోరణిలో తెలుగు తమ్ముళ్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల అన్న క్యాంటీన్ల నిర్మాణంలోనూ ఎటువంటి వర్క్ ఆర్డర్ లేకుండానే ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరుల ప్రోద్బలంతో రూ.కోట్ల పనులను ఓ కాంట్రాక్టర్ చేపట్టాడు. అదీ మరువకముందే నగరంలో అడ్డదారికి శ్రీకారం చుట్టారు. ఎస్ క్యాప్ నిధులు రూ.2.2 కోట్లతో నగరంలోని శ్రీనగర్ కాలనీలో బీటీ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. టెండర్లను ఆహ్వానించగా.. ఓ కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుంది. కాగా ఇటీవల ఈ నిర్మాణ పనులకు ఈఅండ్‌సీ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఇక వర్క్ ఆర్డర్ చేసుకోవాల్సి ఉంది. కానీ అటువంటి పరిస్థితి లేకుండా ఎమ్మెల్యే దగ్గుపాటి నోటి మాటతో కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా పనులు ప్రారంభించేశాడు. వాస్తవంగా వర్క్ ఆర్డర్ లేకుండా పనులు చేస్తే వాటికి అడ్డుకట్ట వేయవచ్చు. బిల్లు చెల్లించకపోవడంతో పాటు సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టు జాబితాలో ఉంచవచ్చు. ఇదిలా ఉండగా ఓ కన్‌స్ట్రక్షన్స్ పేరు మీద తెలుగు తమ్ముళ్లే ఈ పనులు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

ఇంజినీర్ల మొద్దు నిద్ర

నగరపాలక సంస్థలోని ఇంజినీర్లు మొద్దు నిద్రతోనే ఈ అక్రమ తంతు నడుస్తున్నట్లు తెలుస్తోంది. పరోక్షంగా ఓ ఈఈ, డీఈ రోడ్డు నిర్మాణానికి సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈఈ, డీఈ కనుసన్నల్లో పనులు జరుగుతున్నట్లు సమాచారం.

విజిలెన్స్ అధికారులు స్పందిస్తారా?

2017లోని టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి ఇంటి ముందు ఎటువంటి అనమతులు లేకుండా తెలుగు తమ్ముళ్లు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై అప్పట్లో సాక్షిలో కథనం ప్రచురితమైంది. విజిలెన్స్ అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. ప్రస్తుతం అదే తరహాలో రూ.2.2 కోట్ల అభివృద్ధి పనులను ఓ కన్‌స్ట్రక్షన్స్ నిర్వహిస్తోంది. దీనిపై విజిలెన్స్ అధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాలి.



నగరంలోని శ్రీనగర్ కాలనీలో పనులు మొదలు పెట్టిన దృశ్యం

అలా చేయకూడదు

వర్క్ ఆర్డర్ లేకుండా ఎటువంటి పనులు చేయకూడదు. నిబంధనల మేరకే పనులు మొదలు పెట్టాలి. అయినా అలా జరగడానికి ఆస్కారం ఉండదు. ఒకసారి ఫాలో అప్ చేస్తా.
– నాగరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

కొంపముంచిన రసాయనిక మందులు

- ఉదయం మందు పిచికారీ చేసిన రైతు
- మధ్యాహ్నానికే మాడిపోయిన పంట
- అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లిలో ఘటన



మాడిపోయిన టమాట పంట



పంటకు కొట్టిన మందులు ఇవే

రాప్తాడు రూరల్: కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుంది ఓ రైతు పరిస్థితి. టమాట పంట వారంలోగా చేతికొచ్చే సమయంలో కాయకు మచ్చరాకుండా, ఎండు తెగుళ్లు ఆశించకుండా ముందుజాగ్రత్తగా కొట్టిన రసాయనిక ముందులు ఆ రైతు కొంప ముంచాయి. ఏమి జరిగిందో ఏమో కానీ ఎకరన్నర పొలంలో సాగు చేసిన టమాట పంట మొత్తం నాశనమైంది. దీంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లిలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు చిట్టి బాల ఓబిరెడ్డి ఒకటిన్నర ఎకరాలో టమాట పంట సాగు చేశాడు. రెండు నెలలు పూర్తికావడంతో పంట చేతికొచ్చింది. దసరా పండుగ తర్వాత కాయలు తొలగించాల్సి ఉంది. ఈ సమయంలో కాయకు మచ్చ రాకుండా, ఎండు తెగుళ్లు ఆశించకుండా ముందస్తు మందు కొట్టాలని రైతు భావించాడు. రాప్తాడు మండలం రామినేపల్లి వద్ద ఉన్న ఫర్టిలైజర్స్ షాపునకు ఈనెల 7న సాయంత్రం వెళ్లిన రైతు.. కాయకు మచ్చ రాకుండా, ఎండు తెగుళ్లు ఆశించకుండా ఉండేందుకు మందు కావాలని అడిగాడు. ఇందుకోసం రెండు రకాల మందులు ఇచ్చాడు. ఫర్టిలైజర్స్ యజమాని సూచన మేరకు 8వ తేదీ ఉదయం 8 గంటలకు నీటిలో మందులు కలిపి టమాట పంటపై పిచికారీ చేశాడు. 9 గంటలకు ఈ ప్రక్రియ పూర్తి చేసుకుని ఇంటికెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో తోటకు వెళ్లి చూసిన రైతు షాక్‌కు గురయ్యాడు. పంట మొత్తం మాడిపోయింది. ఒక్క చెట్టుకూ పచ్చని ఆకులు లేవు. అన్నీ ముదరకపోయి మాడిపోయాయి. దిక్కు తోచని రైతు ఖాళీ మందు డబ్బాలు తీసుకుని ఫర్టిలైజర్స్ దుకాణం వద్దకు వెళ్లాడు. దుకాణం యజమాని కంపెనీ ప్రతినిధికి సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పంటను పరిశీలించాడు. తమ మందులకు సంబంధించింది కాదని.. ఏమి జరిగిందో తెలియదని కంపెనీ ప్రతినిధి తెలిపాడు. తాను వేరే మందు వాడలేదని మీరిచ్చిన మందే వాడానని రైతు పేర్కొన్నాడు. బాధిత రైతు వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశాడు.



20 రోజుల క్రితం కళకళలాడుతున్న టమాట పంట (ఫైల్)

హార్టికల్చర్ అధికారి రత్నకుమార్ ఏమంటున్నారంటే..

మందు పిచికారీ చేసిన తర్వాత పంట మొత్తం మాడిపోయిందంటూ జంగాలపల్లి రైతు ఓబిరెడ్డి ఫిర్యాదు చేశాడు. గురువారం వెళ్లి పంటను పరిశీలించిన తర్వాత స్పష్టత వస్తుందని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

అనతపురం రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని అనంతపురం ఆర్డీఓ వసంతబాబు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులను హెచ్చరించారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో గర్భస్థ, పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ చట్టంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశావర్కర్లు, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందన్నారు. ఆడ, మగ సమానమేనన్న అంశాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి పెళ్లీడుకొచ్చిన యువతీ, యువకులు, గర్భిణులకు తెలియజేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.పద్మావతి, డా.రవికుమార్, పోలీస్, అంగన్‌వాడీ సిబ్బంది, ఇర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

ప్యాచ్ వర్క్ చేపట్టాలి



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలను పూడ్చటానికి ప్యాచ్ వర్క్‌లను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మేయర్ వసీం ఇంజినీర్లను ఆదేశించారు. బుధవారం నగరంలోని టవర్‌క్లాక్, తిలక్ రోడ్డు, తదితర ప్రాంతాల్లోని రోడ్లను పరిశీలించారు. ఆదేవిధంగా అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఎస్‌ఈ భాస్కర్ రావు, ఈఈ రాధాకృష్ణ, కార్పొరేటర్లు అబూసలేహా, కమల్ భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కుటుంబానికి రూ.6.31 లక్షల సాయం

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీసీ ఆనంద్ కుటుంబ సభ్యులకు ఉమ్మడి అనంతపురం జిల్లా డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది రూ.6.31 లక్షల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన వెలుగు సీసీ ఆనంద్ చెన్నేకొత్తపల్లి మండలంలో విధుల నిర్వహిస్తూ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతడి కుటుంబానికి అండగా నిలువాలన్న ఉద్దేశంతో జిల్లా డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది తమ ఒక రోజు వేతనాన్ని పోగుచేసి సహాయం చేశారు. ఈ మొత్తాన్ని బుధవారం మామిళ్లపల్లి గ్రామంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఏఎం రామ్మోహన్ చేతుల మీదుగా మృతుని భార్య లక్ష్మీదేవికి అందజేశారు.

అంగన్‌వాడీలకు నీటి సౌకర్యం

ఆత్మకూరు: మండలంలోని 21 అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు. బుధవారం ఆమె పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళాయి కనెక్షన్లను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళాయి కనెక్షన్ సమస్యలు, సింటెక్‌లు, మరుగుదొడ్ల సమస్యలు, వంట గదుల్లోకి పైప్ కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. సాక్షం అంగన్‌వాడీ పోషణ్ కింద ఈ పనులు చేపట్టేందుకు అనుమతులు వచ్చాయని తెలిపారు. పైప్, ట్యాప్ కనెక్షన్‌కు ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.17 వేలు, మరుగుదొడ్ల ఏర్పాటుకు రూ.36 వేల చొప్పున నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం అవుతాయన్నారు.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతి

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాపీ మేస్త్రీ రవి కుమార్ (40) బుధవారం మృతి చెందాడు. మండలంలోని ముక్తాపురం గ్రామానికి చెందిన రవికుమార్ నాలుగు రోజుల క్రితం మామిళ్లపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం నుంచి కింద పడి గాయపడ్డాడు. బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గ్రామాభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ హేమలత తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచులు, ఒక్కో పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లకు గ్రామ పంచాయతీల్లో సాధారణ కనీస పరిపాలన విధానం-ఏపీపీఆర్ చట్టం-1994 నిబంధనలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పారిశుధ్య పనులకు సంబంధించి, తాగు నీరు, వీధిలైట్లు, నిర్వహణపై చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ స్వామి, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

13న రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న రెడ్డి వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చిన్నరాసి చంద్రమౌళి రెడ్డి, కార్యదర్శి కిషోర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతినెలా రెండో ఆదివారం ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేట బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ వెనుకవైపు సంఘం కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు బయోడేటా తీసుకొని రావాలని కోరారు. ఈ చక్కటి అవకాశాన్ని రెడ్డి కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 94415 15646, 93902 84295, 94907 67224 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రొఫెసర్ రమణకు దసరా పురస్కారం



ప్రొఫెసర్ జీవీ రమణను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: హైదరాబాద్‌కు చెందిన అవని వారధి చారిటబుల్ ట్రస్టు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జీవీ రమణకు దసరా పురస్కారం అందజేసింది. గత మూడు దశాబ్దాలుగా విద్యా రంగంలో సేవలు చేస్తున్నందుకు ఈ పురస్కారాన్ని అందజేశారు. విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి అవని వారధి చారిటబుల్ ట్రస్టు ఏటా దసరా పురస్కారాలను అందజేస్తోంది.

గజ వాహనంపై ఊరేగిన శ్రీవారు



అనంతపురం కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వేడుకగా సాగుతున్నాయి. బుధవారం రాంనగర్, హౌసింగ్ బోర్డు, శ్రీనివాస నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవ వేడుకల్లో శ్రీవారు ప్రత్యేక అలంకారంలో పూజలందుకున్నాడు. స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గజ వాహనంపై స్వామి దర్శనమిచ్చి భక్తులను కటాక్షించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, పాలకమండలి సభ్యులు అర్చకులు, హరికిషోర్ శర్మ తదితరుల ఆధ్వర్యంలో మూలానక్షత్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వాహన సేవలు సాగుతున్నప్పుడు కళాకారులు పురవీధుల్లో కళాజాతతో ఆకట్టుకున్నారు.

దీవించు.. సరస్వతీ మాత



పాతూరు అమ్మవారి శాలలో సరస్వతీ దేవి అలంకరణ



జ్ఞానపీఠంలో చదువుల తల్లి అలంకరణ



సరస్వతీ దేవిగా అవతరించిన అనంతేశ్వరి



ఉమానగర్‌లో సరస్వతీ దేవి అలంకరణలో రేణుకా దేవి

అనంతపురం కల్చరల్: శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రెండవ రోడ్డులోని శ్రీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకార సేవలు, చండీహోమం, గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని నగర వీధుల్లో తోటోత్సవం భాజాభజంత్రీల నడుమ కనుల పండువగా నిర్వహించారు. పాతూరు అమ్మవారి శాలలో గోమేధిక అలంకారంలో వాసవీమాతను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. భక్తజన సందోహంతో కిటకిటలాడింది. సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. తపోవనం శ్రీవేదమాత గాయత్రీదేవి ఆలయం, మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వరాలయం, శృంగేరీ శారదా శంకర మఠం తదితర ఆలయాలతో పాటూ హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖర బాబు నేతృత్వంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని చిన్నారుల విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టుకున్నారు. అలాగే జొన్నావీరయ్య కాలనీలోని శివశక్తి ఆలయం, శివబాలయోగి ఆశ్రమం, హెచ్చెల్సీ కాలనీ వలీస్వామి ఆశ్రమం, సాయినగర్ కనక దుర్గ ఆలయం, పాతూరు నిముషాంబా దేవి తదితర చోట్ల అమ్మవారు చదువుతల్లిగా, ఐదవ రోడ్డు నల్లమల సుంకులమ్మ అమ్మవారు లలితా పురందేశ్వరీ దేవిగా పూజలందుకున్నారు. స్థానిక సుభాష్ రోడ్డులోని అర్బన్ బ్యాంకు ఎదురుగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ భవన్ ప్రాంగణంలో అమ్మవారు మహాసరస్వతీగా పూజలందుకుంది. శాశ్వత లోక్‌అదాలత్ జడ్జి శ్రీనివాసరావును అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సుంకర రమేష్ తదితరులు సత్కరించారు.

సరస్వతీ దేవిగా దుర్గాదేవి

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లోని గౌరీ ప్రసన్నేశ్వర స్వామి దేవాలయంలో దుర్గాదేవి అమ్మవారు బుధవారం సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జేఎన్‌టీయూ రోడ్డులోని ముత్యాలమ్మ, ఇందిరమ్మ కాలనీలో ఐదో క్రాస్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో పూజలందుకున్నారు. రాప్తాడు శివాలయంలో పార్వతి దేవి, పెద్దమ్మ, మారెమ్మ, మరిగమ్మ, గంగలకుంట గ్రామంలో దుర్గాదేవి, బుక్కచెర్లలో నల్లలమ్మ దేవతలు సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం ఆయా ఆలయాల్లో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో వాసవీ మాతను సరస్వతీ మాతగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అదే విధంగా పంపనూరులోని పార్వతీ దేవి, వడ్డుపల్లిలోని సుంకులమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు.



ఆత్మకూరు: అలంకరణలో వాసవీ మాత



రాప్తాడు: చిన్మయనగర్ శివాలయంలో దుర్గాదేవి



పాతూరు అమ్మవారి శాలలో భక్తిగీతాలాపన



చెరువు కట్ట వద్ద ఉన్న నిమిషాంబ దేవి ఆలయంలో సరస్వతీ దేవి అలంకరణ